నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 నిజామాబాద్ మంగళవారం 6 ఆగస్టు 2024 ADILABAD NIRMAL

# పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి..

**కలెక్టర్ అభిలాష అభినవ్**




ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 5 : పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని 'స్వచ్ఛదనం-పచ్చదనం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు. మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే డ్రై డేలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కల్యాణి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, తహసీల్దార్ రాజు, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

# రుణాలు మాఫీ చేయండి సారూ..

- ఇండియన్ బ్యాంకు వద్ద 550 మంది రైతులు
- కలెక్టర్ కార్యాలయంలో వినతి



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న రైతులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 5 : నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంకులో రుణాలు తీసుకున్న 550 మంది రైతులకు మాఫీ కాలేదని నిరసిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సయ్య, ఎర్రన్న, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

# మున్సిపల్ కార్యాలయం ముట్టడి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 5 : నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నెలకుని ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని కాలనీవాసులు ముట్టడించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఒల్లెపు తిరుపతి మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని, విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగడం లేవని.. కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఫొటోలతో కార్యాలయం ఎదుట ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సమస్యలను అధికారులు, పాలకులు వారం రోజుల్లో పరిష్కరించాలని, లేనిచో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజుకు వినతి పత్రం అందించారు.




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

# కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, ఆగస్టు 5 : ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీ-యింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. గురుకులాలు, వసతి గృహాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాసుల సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్, కుమ్ర అరుణ్ సురేశ్, రవి పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణను పునః పరిశీలించాలి..

**కలెక్టర్ కార్యాలయంలో పలువురి వినతి**

నిర్మల్ అర్బన్, ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పును పునః పరిశీలించి రాజ్యాంగ బద్ధంగా న్యాయం చేయాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. విశ్వబ్రాహ్మణలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు అశోక్ వినతి పత్రం అందించారు. 50 ఏండ్ల వారికి పెన్షన్ అందించాలని, ఉచిత విద్యుత్, పోలీసుల వేధింపులను అరికట్టి, ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు గణేశ్, వెంకటస్వామి, అనంతరావు, సత్యం, పోశెట్టి పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పీవో ఖుష్బూ గుప్తా

# సమస్యల పరిష్కారానికే దర్బార్

ఉట్నూర్, ఆగస్టు 5 : గిరిజనుల సమస్యల పరిష్కారానికే గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజనుల సమస్యలను విన్నవించుకునేందుకు దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్జీలు పెట్టుకున్న వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, డీసీసీ డీఎం రామానందం, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

# పట్టణాలు, పల్లెలు పచ్చదనంతో కళ కళ లాడాలి

**విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్, ఎమ్మెల్యే**



జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

ఎదులాపురం, ఆగస్టు 5 : పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలి రోజు వైద్య ఆరోగ్య, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఆయా కాలనీల్లో గ్రావెల్ వేయడానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్, డీవైఎస్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.



పల్లకీ ఎత్తుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న

# సన్మార్గంలో నడవాలి

**- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

తలమడుగు, ఆగస్టు 5 : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం అర్లి(కే) గ్రామంలో 24 ఏండ్ల తర్వాత అఖండ జ్యోతి కార్యక్రమాన్ని గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. వీరికి గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శబరి మాత ఆశీస్సులతో అఖండ జ్యోతి కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, మండల కన్వీనర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి

ఇచ్చోడ, ఆగస్టు 5 : అందరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు నిచ్చారు. సోమవారం సిరిచెల్మ గ్రామంలోని పురాతన శివాలయం గల శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.

# యువకుడి మృతి

**గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఠాణా ఎదుట ఆందోళన**



సంద విఠల్ (ఫైల్)



టూ టౌన్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు, కుటుంబ సభ్యులు

ఎదులాపురం, ఆగస్టు 5 : జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సంద విఠల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం ఉదయం మృతి చెందారు. దీంతో యువకుడు నివసిస్తున్న కాలనీవాసులు యువకుడిని ఢీ కొట్టి వెళ్లిన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విఠల్‌కు వికలాంగుడైన నాన్న, వృద్ధురాలైన అమ్మతోపాటు భార్య, ఐదేళ్ల కూతురు ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, వారిని ఆదుకోవాలని పోలీసులను కాలనీవాసులు కోరారు. ఇదిలా ఉంటే పోస్టుమార్టం చేసేందుకు పోలీసులు సమయానికి రాలేదని, వారి తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని తరలిస్తున్న పార్థివ వాహనాన్ని కలెక్టర్ చౌరస్తాలో గల టూ టౌన్ ఎదుట నిలిపి రాస్తారోకో చేపట్టారు. టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావు ఆందోళనకారులను సముదాయించి నిరసనను విరమింప చేశారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ సభ్యులు

# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ఇంద్రవెల్లి, ఆగస్టు 5 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మండలంలోని దళిత సంఘాల నాయకులు తరలివచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేస్తే దాదాపు 90 శాతం మందికి అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 21న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కామ్‌రాజ్ వాగ్మారే, మస్కే రాజ్‌వర్ధన్, దిలీప్‌మోరే, కాంబ్లే ఉత్తమ్, శివాజీ, సత్యానంద్, అతిశ్‌కుమార్, పరత్‌వాగ్ దత్తా, భరత్, గౌత్తం, కచ్రు, శుదోధన్, బాపురావ్, ఆనంద్‌రావ్, గోపీనాథ్, దిలీప్ , తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నిర్మల్ అర్బన్, ఆగస్టు 5 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని, ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థకు అప్పజెప్పడాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 13న మండల కేంద్రాలు, 21న హైదరాబాద్ ముట్టడిని చేపడుతామన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు


















